క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వైద్య ఖర్చుల కోసం ఆ కుటుంబానికి రూ.2.50 లక్షల విలువ గల ఎల్‌వోసీని శనివారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అందజేశారు. మండలంలోని రాజారం గ్రామానికి చెందిన డొంగరి అభిలాష్ అనే యువకుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి వైద్య ఖర్చుల కింద ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి ఎల్‌వోసీ అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: ఆరోగ్య తెలంగాణే లక్ష్యం ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం మేడిపల్లి, భీమారం మండలాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇటీవల అమెరికా టోలాసో యూనివర్సిటీ అవార్డుకు ఎంపికైన సామాజిక సేవకుడు అంగడి ఆనంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, నాయకులు చేపూరి నాగరాజు, కొత్తపల్లి అజయ్, సాయిని గంగారెడ్డి, పుల్లూరి దేవయ్య, తోకల నర్సయ్య, పుప్పాల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రొజెక్టర్ వితరణ



కంప్యూటర్, ప్రొజెక్టర్ అందిస్తున్న శంకర్

పెగడపల్లి: మండలంలోని దోమలకుంట ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన గాదర్ల రమేశ్ కంప్యూటర్, ప్రొజెక్టర్ సమకూర్చారు. దుబాయిలో ఉంటున్న రమేశ్ రూ.40 వేల విలువ గల కంప్యూటర్, ప్రొజెక్టర్‌ను ఆయన తండ్రి గాదర్ల శంకర్ శనివారం పాఠశాల ఎచ్ఎం గాలి నాగరాజ్ యాదవ్, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

నృసింహుడి సన్నిధిలో రద్దీ



ఆలయంలో భక్తుల పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

లండన్‌లో జాతీయ జెండా రెపరెపలు



జగిత్యాల: లండన్‌లోని థేమ్స్ నదిపై నిర్మించిన టవర్ బ్రిడ్జి పరిసరాల్లో జగిత్యాలవాసులు స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక బోట్‌లో జాతీయ జెండాను పట్టుకుని జైహింద్ అంటూ నినదించారు. వేడుకను విదేశాల్లో జరుపుకోవడం సంతోషంగా ఉందని జగిత్యాలకు చెందిన వంశీ, కార్తీక్ అన్నారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం

కొడిమ్యాల: మండలంలోని సూరంపేట గ్రామ పరిధి అడవిలో ఈ నెల 15 వ తేదీ రాత్రి సమయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు అనుమానస్పదంగా ఉన్న ద్విచక్ర వాహనాన్ని గమనించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనదారుని వివరాలు తెలుసుకుని అక్కడ తన బండి ఎందుకు వదిలి వెళ్లాడో విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వావ్.. వెన్నముద్దల గండి

సండే స్పెషల్

- రమణీయం... ఈ స్పాట్
- ఆహ్లాదపరిచే వర్షపునీరు
- అడవుల మధ్య ప్రకృతి సోయగం
- తరలివస్తున్న పర్యాటకులు





రాయికల్: ఎత్తైన కొండలు.. చుట్టూ చెట్లు మధ్యలో జలపాతాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలో వెన్నముద్దల గండి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. .ఈ గండి విశేషాలు తెలుసుకోవడం కోసం జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి 35 కిల్లో మీటర్ల దూరంలో ఉన్న కట్కాపూర్ గ్రామానికి వెళ్లాల్సిందే మరి..

రాయికల్, బీర్‌పూర్ మండలాల సరిహద్దు గ్రామాలైన కట్కాపూర్ గ్రామ శివారులో వెన్నముద్దల గండి ఉంది. ఇది ఎత్తైన కొండల మధ్యలో జలపాతాలు ఉన్నట్లుగానే ఎటు చూసినా పచ్చదనం, ఎత్తైన కొండలు, కొండల మధ్యలో సాగే జలపాతాలను చూసేందుకు ప్రతి ఏటా ప్రకృతి ప్రేమికులు తరలివస్తున్నారు. జగిత్యాల జిల్లా, కరీంనగర్,నిజామాబాద్, నిర్మల్, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన పర్యాటకులు వెన్నముద్దల గండికి వచ్చి ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నారు. వర్షాలు కురవడంతో గ్రామ శివారులోని హన్మంతురాయి నుంచి వర్షపు నీరు కొండల మధ్యలోంచి వర్షపు నీరు ప్రవహించి గోదావరిలో కలిసిపోతుంది. ఈ ప్రాంతాంను చూడడం కోసం వివిధ జిల్లాలకు చెందిన పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదంగా గడుపుతారు.

కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేస్తాం



వెన్నముద్దల గండి పచ్చని చెట్లు, కొండల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడికి దాక్టర్లమందరం అంతా కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఎంతో ఎంజాయ్ చేస్తాం. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– డాక్టర్ మోర రోజా, డీజీవో జగిత్యాల

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలోని వెన్నముద్దల గండిని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించాలి. ఈ ప్రదేశాన్ని చూడటం కోసం ప్రతీ ఏడాది వివిధ జిల్లాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. దీనిపై ప్రచారం కల్పిస్తే ఇంకా ఆదరణ పెరుగుతుంది.

– బట్టు రంజిత్ కట్కాపూర్

పైప్ లైన్‌కు తవ్వారు.. వదిలేశారు...



కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్‌లో అమృత్-2 పథకంలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసే తాగునీటి పైప్ లైన్ కోసం గ్రామంలో సీసీ రోడ్లన్నీ తవ్వి అలాగే వదిలేశారు. ఈ తవ్వకాల్లో డ్రైనేజీల్లోకి వేసిన ఇండ్ల సెప్టిక్ ట్యాంకు పైపులు, ఇంతకముందు ఉన్న తాగునీటి పైపులు దెబ్బతిని నీళ్లు వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కొత్త పైప్ లైన్లు వేసి, దెబ్బతిన్న పైపులకు మరమ్మతులు చేసి దెబ్బతిన్న పైప్‌లైన్లు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్ గౌడ్, బల్దియా కమిషనర్, కోరుట్ల సెల్ నంబర్: 9849905880

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సీఎంఆర్‌ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం సహాయనిధి సహాయాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన శ్రీనివాస్‌కు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా, చెక్కును శనివారం లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, శ్రీరాం, బిక్షపతి పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు

రాయికల్: మండలంలోని తాట్లవాయి హనుమాన్ ఆలయాభివృద్ధికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.1.75 లక్షలు మంజూరు చేయగా, శనివారం హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు ఆకుల మల్లేశం, వెంకటేశ్వర్‌రావు, చెట్లపల్లి రాజు, కొత్తకొండ రాంచంద్రం, గంగారెడ్డి కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బోర్నపల్లి వద్ద గోదావరిని పరిశీలిస్తున్న తహసీల్దార్



లింగాపూర్ పెద్ద చెరువు పరిశీలిస్తున్న తహసీల్దార్

పెగడపల్లి: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశ మున్నందునా పెగడపల్లి మండలంలోని లింగాపూర్, నంచర్ల, వెంగళాయిపేట, పెగడపల్లి గ్రామాల్లో శనివారం తహసీల్దార్ పర్యటించి చెరువులను సందర్శించి నీటి మట్టం పరిశీలించారు. ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా చెరువుల వద్దకు వెళ్లోద్దని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట సిబ్బంది తిరుపతి, వినయ్ ఉన్నారు.

గోదావరి తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాయికల్: కడెంలో గేట్లు ఎత్తివేయడంతో గోదావరి తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ సూచించారు. శనివారం రాయికల్ మండలం బోర్నపల్లి గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలించారు. చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని కోరారు. అలాగే గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ పద్మయ్య ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కోరుట్లలో చిన్నారుల సంబరాలు



రాయికల్‌లో చిన్నారుల సంబరాలు



పెగడపల్లిలో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



చింతకుంటలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



మెట్‌పల్లి ఆలయంలో భక్తుల పూజలు

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ధరించి ఉట్టి కొట్టారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పెద్దపూర్ ఇస్కాన్ టెంపుల్ భక్తులు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించి చిన్నారులకు కృష్ణుడి వేషాధారణలు వేయించి ఉట్టిని పగులగొట్టారు.

మెట్‌పల్లి: పట్టణంలోని శ్రీకృష్ణమందిరంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలో శనివారం శ్రీ కృష్ణాష్టమి ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టె కార్యక్రమం నిర్వహించి యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. చిన్నారుల శ్రీకృష్ణుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి.



కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.పట్టణంలో యువకులు ఉట్లు కొట్టి సంబరాలు జరుపుకున్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని అన్నదానం చేశారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామంలో శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. గోపికలు, కృష్ణుడి వేషాధారణలో చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు.

జోరువాన



మైతాపూర్‌లో రోడ్డుంపై ప్రవహిస్తున్న వర్షపునీరు



లంబాడిపల్లి వాగులో పారుతున్న వరదనీరు

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో శనివారం వేకువజాము నుంచి భారీగా వర్షం కురిసింది. బల్దియాలోని వీరాపూర్ క్రాసింగ్ రోడ్ వద్ద వర్షపునీటితో కుంట అంతా జలమయం కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మైతాపూర్-అయోధ్యకు వెళ్లే వంతెనపై వర్షపునీరు చేరడంతో కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిపివేశారు.

మల్యాలలో జోరువాన

మల్యాల: మండల వ్యాప్తంగా గ్రామాల్లో జోరువాన కురిసింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురవడంతో మండల కేంద్రంలోని మొండికుంట ఒర్రె, మద్దుట్లలోని వాగు, లంబాడిపల్లిలోని వాగులకు జలకళ వచ్చింది. మండల కేంద్రంలోని మత్తడి చెరువులోకి వరద చేరుతుండడంతో జలకళ సంతరించుకుంది.

కొండాపూర్ ఊర చెరువు పరిశీలన



చెరువు పరిశీలిస్తున్న ఎస్సై శ్రీధర్‌రెడ్డి

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్- విలయతాబాద్ మధ్య గల కొండాపూర్ ఊరు చెరువుని మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి శనివారం పరిశీలించారు. వరద కాలువ నుంచి దిగువకు నీళ్లు రావడం, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువు నిండటంతో మత్తడి దూకుతు విలయతాబాద్ రోడ్డు పైకి నీరు చేరడంతో కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై చెరువు పరిసరాలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతికూల సమయాల్లో గ్రామ యువత సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతోందని, సమస్యపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

లోలెవల్ వంతెన వద్ద బారికేడ్స్ ఏర్పాటు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్, సింగరావుపేట లోలెవల్ వంతెనలపై శనివారం రాత్రి ఎస్సై సుధీర్‌రావు, ఎంపీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో బారికేడ్స్ ఏర్పాటు చేశారు. కడెం ప్రాజెక్ట్‌లో గేట్లు ఎత్తివేయడంతో నీటి ప్రవాహం ఎక్కువ కానున్న నేపథ్యంలో రాత్రి పూట లోలెవల్ వంతెలనలపై ఎవరూ ప్రయాణం చేయవద్దని కోరారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అశోక్

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన న్యాయవాది మ్యాదరి అశోక్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఏర్పాటు



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో శనివారం ముదిరాజ్ సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నారెల్లి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా అయిలవేని లింగన్న, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన సుజీత్‌రావు

మెట్‌పల్లి: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థికంగా మేలు కలుగుతోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాల: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహార్ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు మరువలేనివని భారత్ సురక్ష సమితి నాయకులు అన్నారు. స్థానిక తహసీల్ చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులుగా, మూడుసార్లు ప్రధానిగా సేవలందించి దేశ ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, కార్యదర్శి కాశీనాథం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయలో శనివారం రాత్రి శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గుండి వినయ్ శర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ అష్టోత్తర పూజలతో పాటు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు వినయ్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి భజన మండలి సభ్యులచే భజనలు చేపట్టారు.